క్లుప్తంగా

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకురాలి పరిశోధనకు అవార్డు



గుంటూరు రూరల్: తమ కళాశాల ఆర్‌జేసీ నెస్ట్ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ జి.కవిత జరిపిన పరిశోధనకు జాతీయస్థాయిలో లభించిన అవార్డు కళాశాల పరిశోధనా రంగం సాధిస్తున్న పురోగతికి ప్రతీకగా నిలుస్తోందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ ఇటీవల పుదుచ్చేరిలో వీడీ గుడ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సహకారంతో బ్రైనీమీట్ సంస్థ నిర్వహించిన 2వ అంతర్జాతీయ మహిళా పరిశోధకుల అవార్డుల కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన 84 మంది మహిళా పరిశోధకులు పాల్గొన్నారు. ఇందులో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జి.కవిత అడసోర్షన్ ఆఫ్ టెక్స్టైల్ డైస్ యూసింగ్ బయో అక్టివ్ ఫిల్టర్ బెడ్స్ అనే శీర్షికతో తన పరిశోధన ప్రదర్శించారన్నారు. ఈ పరిశోధనలో చిన్న, మధ్య తరహా టెక్స్‌టైల్ డైయింగ్ యూనిట్ల నుంచి నీటి వనరులు నేలల్లోకి విడుదల అవుతున్న విషపూరిత రంగు రసాయనాల సమస్యకు పరిష్కారం చూపే హార్డ్‌వేర్ నమూనాను రూపొందించారని తెలిపారు. ఈ పరిశోధన జాతీయ స్థాయిలో విశేష గుర్తింపును సాధించి అవార్డు అందుకుందన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్‌లు అవార్డు అందుకున్న అధ్యాపకురాలిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆమె రూపొందించిన ప్రోటోటైప్‌ను స్టార్ట్ అప్‌గా అభివృద్ధి చేసే దిశగా నిధుల ద్వారా రూ.8 లక్షల రూపాయలు మంజూరు చేయడం గర్వకారణమన్నారు. ఇప్పటి వరకు 31 కొత్త స్టార్టప్‌లు నెలకొల్పబడ్డాయని, వీటిలో 16 స్టార్ట్ అప్‌లకు ఈడీఎస్‌టీ నిధుల ద్వారా రూ.77 లక్షల రూపాయల వరకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇది కళాశాల పరిశోధనా రంగానికి మరింత ప్రేరణగా మారిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస రావు, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్ రావు, డాక్టర్ హఫీజ్‌బాషా పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో నేడు కోటి సంతకాల సేకరణ

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కూటమి ప్రభుత్వం నిరంకుశంగా పేద విద్యార్థుల విద్యా భవిష్యత్‌ను నాశనం చేసేందుకు ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణ కార్యక్రమానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ద్వారా, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున, ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, హాజరై మద్దతుగా నిలవాలని కోరుతున్నామన్నారు.

ముగిసిన టెక్‌ఫెస్ట్

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న టెక్‌నిర్వాణ టెక్‌ఫెస్ట్ 2 కె 25 గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇటువంటి వర్క్‌షాపుల వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతకు మెరుగు దిద్దవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లో భాగంగా వివిధ పోటీలను నిర్వహించామన్నారు.

ఇద్దరు ప్లానింగ్ సెక్రెటరీలపై సస్పెన్షన్ వేటు

నెహ్రూనగర్: కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సస్పెండ్ చేశారు. 55వ సచివాలయంలో పనిచేస్తున్న జె.గిరిబాబు 121వ సచివాలయంలో పనిచేస్తున్న ఎ.జీవన్ ప్రభు కళ్యాణ్ లు అనుమతి లేకుండా సమీక్ష సమావేశాలకు హాజరు కాకపోవడం, పట్టణ ప్రణాళిక విభాగ క్షేత్ర స్థాయి విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంపై గురువారం విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు.

నిందితుడికి రిమాండ్

గుంటూరు లీగల్: హత్య కేసులో దాసరి వీరయ్య అలియాస్ చుక్కపల్లి వీరయ్యకు రిమాండ్ విధించినట్లు ఆరోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎడవూరు గ్రామానికి చెందిన కుర్రా నాగగణేష్ హత్య కేసులో దాసరి వీరయ్య ప్రమేయం ఉందంటూ నేరారోపణ ఉన్న క్రమంలో 8వ నిందితుడిగా గుర్తిస్తూ పోలీసులు అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో కోర్టులో వాద ప్రతివాదనల అనంతరం వీరయ్యను 14 రోజుల వరకు రిమాండ్ విధించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాడతాం

- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- పొన్నూరు 23వ వార్డులో కోటి సంతకాల సేకరణ



ప్రైవేటీకరణతో నష్టాన్ని మహిళలకు వివరిస్తున్న అంబటి మురళీకృష్ణ



ప్రజల సంతకాలు సేకరిస్తున్న సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా గురువారం పట్టణంలోని 23వ వార్డులో అంబటి మురళీకృష్ణతో పాటు నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల అభ్యున్నతికై మెడికల్ కళాశాలల నిర్మాణాలను చేపట్టిందన్నారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసే పనిలో నిమగ్నమైందని విమర్శించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ కార్యక్రమం ద్వారా చేపట్టిన ప్రజా ఉద్యమంలో తమ సంతకాలతో ప్రజలు తమ సంతకాలతో పోరాటంలో భాగస్వాములవుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 50 వేల మంది సంతకాలు చేసి వ్యతిరేకతను స్పష్టం చేశారని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు ఈ రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో ప్రజలకు జరిగే నష్టాల ని వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ మెంబర్ షేక్ సైపుల్ల, రాష్ట్ర యువజన విభాగ జాయింట్ సెక్రటరీ అమిరినేని సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు చిర్ర అక్కిరెడ్డి, 23వ వార్డు మాజీ కౌన్సిలర్ గేరా కుమారి సంజీవ్, మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, మండల మైనార్టీ, ప్రచార, వైద్యం, వైఎస్సార్‌టీయూసీ విభాగాల అధ్యక్షులు షేక్ మౌలాలి, తురిమెళ్ల రాజశేఖర్, మోహనరావు, రుద్రపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు షేక్. నాజర్, వట్టిప్రోలు రంగారావు, అంజుమన్ కమిటీ మాజీ అధ్యక్షులు షేక్. మాము, షేక్. మహమ్మద్, ఆకుల రామ్మోహన్, మిక్కిలి జాన్, పలగాని రమేష్, పీరు, గోపిశెట్టి శ్రీను, మూర్తి రాజు, అనిత, గనిపిశెట్టి వెంకటేశ్వర రావు, సుశోభిత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేతాజీ నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో కలెక్టర్ తనిఖీ



విద్యార్థిని విద్యా సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

లక్ష్మీపురం: గుంటూరు గ్రామీణ మండలం లాలుపురం నేతాజీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకటవ తరగతి విద్యార్థుల హాజరు పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు, గైర్హాజరు విద్యార్థుల వివరాలు యాప్‌లో తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని తనిఖీ చేశారు. తరగతి గదిలో ఉన్న బోధనోపకరణాలను గూర్చి అడుగగా స్వయంగా తయారు చేసి విద్యార్థుల బోధనకు ఉపయోగించడం జరుగుతుందని వివరించగా సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేశారు. విద్యార్థుల ఎత్తు, బరువులను పరిశీలించారు. విద్యార్థులకు గుణాత్మక, ప్రామాణిక విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. చిన్నప్పటి నుంచి విలువలతో కూడిన విద్య అవసరమని చెప్పారు. సొంత పిల్లల్లా చూసుకుంటూ ఆదర్శప్రాయమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల చక్కటి ప్రవర్తన, ఉన్నత విద్య, వారి ఆరోగ్యం ప్రధాన బాధ్యతగా ఉపాధ్యాయులు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం నాణ్యత, తాగునీటిలో ఎటువంటి అలసత్వం వద్దని స్పష్టం చేశారు. ప్రధాన ఉపాధ్యాయుడు అన్వర్ బాషా విద్యార్థుల హాజరు, యాప్‌లో నమోదు తదితర అంశాలను వివరించారు. తహసీల్దార్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఎదురుపడితే దాడి చేస్తున్నాయి!

- మహాప్రభో.. వీధికుక్కలతో వేగలేకున్నాం
- చర్యలు చేపట్టాలంటూ గ్రామస్తుల వినతి



పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వీధికుక్కల సమూహం

పెదకాకాని: గ్రామాల్లో గుంపులు గుంపులుగా చేరి ప్రజలపై వీధి కుక్కలు ఎగబడుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. గత కొంతకాలంగా మండల పరిధిలోని వెనిగండ్ల, కొప్పురావూరు, అగతవరప్పాడు, పెదకాకాని, నంబూరు, తక్కెళ్లపాడు గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఇళ్ల నుంచి బయటకు వెళుతున్న ప్రజలు రోడ్డుపై ఉన్న వీధికుక్కలు దాడి చేస్తాయోనని వణికిపోతున్నారు. ఇప్పటికే మండలంలో గతంలో పోలిస్తే కుక్కకాటు బాధితులు పెరిగిపోతున్నారు. గతంలో వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైనా ఎగబడి దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా వెనిగండ్ల, పెదకాకాని, అగతవరప్పాడు గ్రామాలు గుంటూరు నగరానికి సమీపంలో ఉండటం నగరంలో పట్టిన కుక్కలను నగర శివారు ప్రాంతాలకు తీసుకు వచ్చి వదిలి వెళుతున్నారు. దీంతో ఆహారం కోసం ఆ కుక్కలు గ్రామాల్లోకి చేరుకుని ప్రజలపైనా ముఖ్యంగా చిన్న పిల్లలపైనా దాడులు చేస్తున్నాయి. రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే వారిపై కుక్కలు ఎగబడటంతో ఎక్కడ దాడి చేస్తాయోనని భయభ్రాంతులకు గురౌతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో వీధికుక్కల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

నంబూరులో ధాన్యం కొనుగోలుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న తులసి

పెదకాకాని: ప్రతి గ్రామంలోనూ ధాన్యం సేకరణ జరుగుతుందని జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ తులసి అన్నారు. మండల పరిధిలోని నంబూరులో గురువారం రైతులకు రాబోయే సీజన్లో వరి ధాన్యం సేకరణ, వరికి మద్దతు ధర, ప్రతి గ్రామానికి ఏర్పాటు చేసిన వే బ్రిడ్జిలు, మిల్లర్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల వ్యవసాయ అధికారి కె.రమణకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ నవంబర్ నుంచి ప్రతి గ్రామంలో వరి ధాన్య సేకరణ జరుగుతుందన్నారు. రైతులు వరి పంట కోసిన తర్వాత రెండు మూడు రోజులు ఆరబెట్టుకొని తేమశాతం 17% కన్నా తక్కువగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ని కలిసిన మీకు సంబంధించిన ధాన్యానికి షెడ్యూలు ఇచ్చి కూపను జనరేట్ చేయడం జరుగుతుందన్నారు. సివిల్ సప్లయీస్‌కి చెందిన టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆ ట్రక్కు సంబంధించిన జియో కోఆర్డినేటర్స్, ట్రక్‌రిసిప్ట్, వేబ్రిడ్జి రిసిప్ట్‌లను పొందుపరచి ఆ గ్రామానికి సంబంధిత మిల్లుకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం క్వింటాలకు వరి మద్దతు ధర 2369 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. అలానే రైతులు తమ బ్యాగులు, ట్రాక్టర్ వారే తెచ్చుకొనవచ్చని, అలా లేనివారికి ఒక బస్తా (బ్యాగ్) 4.72 పైసలకు సరఫరా చేస్తుందన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్ మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభం కాగానే రైతు సేవా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు షెడ్యూల్ ఇచ్చి కూపన్స్ జనరేట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పొలంలో తీసిన తేమ శాతానికి, మిల్లులో తీసిన తేమ శాతానికి వ్యత్యాసం ఉండటం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలానే కొంతమంది రైతులు వరి ధాన్యం ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్ గాని సిర్పాలిన్ పట్టలు సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

చేబ్రోలు: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సిబ్బందికి తహసీల్దారు కె. శ్రీనివాస శర్మ సూచించారు. మండలంలోని సుద్దపల్లి, శలపాడు, శేకూరు, వడ్లమూడి, వేజండ్ల, నారాకోడూరు, చేబ్రోలు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు శ్రీనివాసశర్మ, వ్యవసాయశాఖాధికారి పి.ప్రియదర్శినిలు పరిశీలించారు.

భూసార పరీక్ష ఫలితాల కార్డుల పంపిణీ



గుంటూరు రూరల్: మండలంలోని బుడంపాడు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షా ఫలితాల కార్డుల పంపిణీ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ మాట్లాడుతూ రైతులకు భూసార ఫలితాల కార్డుల ప్రాధాన్యత గురించి వివరించారు. భూసార ఫలితాల ఆధారంగా వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, జీవ ఎరువుల వినియోగం, వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. వరి పంట వేసిన రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను అమ్ముకోవాలనుకుంటే, వారు తప్పనిసరిగా ఆర్ఎస్కే కేంద్రాలలో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వే, పంట నమోదు చేయని రైతులు తక్షణమే ఆర్ఎస్కే కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లం పురోభివృద్ధిలో సెమినార్స్, వర్క్‌షాపులు దోహదం



గుంటూరు రూరల్: కళ్లం హరినాథ్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల స్వయం ప్రతిపత్తి సాధించడానికి నిబద్ధత గల అధ్యాపకులు, విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడేందుకు వివిధ డిపార్ట్‌మెంట్‌లలో తరచూ నిర్వహించే సెమినార్లు ఎంతగానో దోహదం చేస్తున్నాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో నిర్వహించిన ఎక్స్‌ప్లోరైటరీ డేటా ఎనాలసిస్ విత్ పైథాన్ అనే అంశంపై తొమ్మిది రోజులు పాటు నిర్వహించిన వర్క్ షాప్ ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఓరియంటెడ్ ట్రైనింగ్‌ల ద్వారా విద్యార్థులు నేరుగా ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని నేర్చుకుంటారని, తద్వారా వారు పరిశ్రమ అవసరాలను తీర్చగల స్థాయికి చేరుకుంటారన్నారు. సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ వి రాజీవ్ జడ్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు పైథాన్ డేటా ఎనాలసిస్ ప్రస్తుత డిజిటల్ యుగంలో అత్యంత అవసరమైన నైపుణ్యాలు తెలుసుకునేందుకు శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సెల్ ఆర్ ఎడ్యుకేట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు లక్ష్మణరావు, శ్యామ్ శ్రీనివాస్, అధ్యాపకులు కె.నాగేశ్వరరావు, డాక్టర్ ఏ.శ్రీనివాసరావు, చుక్క సామ్సన్ పాల్గొన్నారు.

సమాజంపై మీకు బాధ్యత ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ కె. విజయలక్ష్మి
- మలినేనిలో అట్టహాసంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి, మలినేని పెరుమాళ్ళు

ప్రత్తిపాడు: విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం పాలిటెక్నిక్ విద్యార్థినుల ఫ్రెషర్స్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకుంటూ ముందుకు విద్యనభ్యసించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యపరంగా మంచి అలవాట్లును అలవర్చుకోవాలని సూచించారు. సమాజానికి మేలుచేసే మంచి పౌరులుగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ మహిళలకు డిప్లొమా, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ ఎం.టెక్, ఎంఫార్మసీ.. వంటి అన్ని విభాగాలను కలిగిన ఏకైక విద్య సంస్థ మలినేని అని తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ, లైవ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వివరించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ అప్పారావు, డీన్ లు కిషోర్ బాబు, పోపూరి రమేష్ బాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో కబడ్డీ టోర్నమెంట్



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఆంజనేయులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ మహిళల కబడ్డీ టోర్నమెంట్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు జట్టు పని, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ తరహా క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమని, ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం తమకు గౌరవంగా భావిస్తున్నామని తెలియజేశారు. ఈ కబడ్డీ పోటీల్లో ఏఎన్‌యూ పరిధిలోని వివిధ కాలేజీల నుంచి 14 టీంలు పాల్గొన్నారని చెప్పారు. టోర్నమెంట్‌లో కోచ్‌లు, మేనేజర్లు, అధికారులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని పర్యవేక్షించారు. విశ్వవిద్యాలయం తరపున ఇద్దరు నిర్దేశకులు ఎంపిక కమిటీ సభ్యులుగా ఈ టోర్నమెంట్‌కు హాజరై, ప్రతిభావంతులైన క్రీడాకారిణుల ఎంపిక కోసం పరిశీలించారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

ఎంపీడీవో కె. శివపార్వతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కె. శివపార్వతి

ప్రత్తిపాడు: గ్రామాలు క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలని, ప్రజలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యపడుతుందని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా థీమ్-5, క్లీన్- గ్రీన్ విలేజ్ ఆర్‌జీఎస్ ఏ 2025-26 వార్షిక ప్రణాళికపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన ఎంపీడీవో శివపార్వతి తొలుత అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. చెత్త వ్యర్థాల నిర్వహణ, తడి-పొడి వ్యర్థాలను వేరుచేయు విధానాలను రిసోర్స్ పర్సన్‌లు షేక్ ఖాజా, మూర్తి, ఈవీఎస్ రెడ్డిలు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివపార్వతి మాట్లాడుతూ గ్రామాలు స్వచ్ఛంగా ఉండటంలో క్లాప్ మిత్రల పాత్ర కీలకమన్నారు. ప్రతిరోజూ, ప్రతి గ్రామ పంచాయతీలో డోర్ టు డోర్ చెత్త సేకరణ చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు చెత్తను ఎస్ డబ్ల్యూ పీసీకి తరలించి ఆదాయ వనరుగా మార్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, ఎంపీడీవో కార్యాలయం ఏవో కె. మోహన్ రావు, స్వచ్ఛ భారత మిషన్ మండల రిసోర్స్ పర్సన్ డి. శ్రీనివాసరావు, పదహారు గ్రామ పంచాయతీల క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రులు పాల్గొన్నారు.



మా దారి... అడ్డ దారి!!

పొన్నూరు పట్టణంలోని ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గుంటూరు నుంచి, కసుకర్రు రోడ్డు నుంచి, ఐలాండ్ సెంటర్ నుంచి వచ్చే వాహనాలతో శ్రీ తోటమ్మ తల్లి ఆలయం వద్దనున్న మలుపు ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. నాలుగు రోడ్లకు అనుసంధానంగా ఉన్న ఈ మలుపులో వచ్చే వాహనాలు అతి వేగంగా వచ్చి మలుపు దాటే సమయంలో వాహనాలు ఎదురెదురు అవుతుండటంతో అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇదే మలుపులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన కూడా చోటు చేసుకుంది. గతంలో ఆ మలుపు వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ జరిగింది. ప్రస్తుతం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో రాంగ్ రూట్‌లో వాహన రాకపోకలు ఎక్కువయ్యాయి. పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ ప్రాంతంలో రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

–పొన్నూరు



పెదకాకాని- వెనిగండ్ల రోడ్డుకు నిధులు మంజూరు

పెదకాకాని: స్థానిక ప్రధాన సెంటర్ నుంచి వెనిగండ్ల పొలిమేర సెంటర్ వరకూ వెళ్లే రోడ్డుకు ఎట్టికేలకు మోక్షం లభించింది. ఈ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం నుంచి 3.50 కోట్లు నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో గురువారం డీఈ చిన్నయ్య, ఏఈ సాయికృష్ణలు పెదకాకాని చేరుకుని రోడ్డును పరిశీలించారు. వారితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ మధ్యాహ్న భోజనం చేయాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం చేసే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిరోజు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే విధంగా వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో కాకుమాను ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీ.వీ.బీ. వెంకట్రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.